## క్లుప్తంగా

### వేసవి శిబిరాలతో మేలు



డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో హెచ్ఎం క్రాంతికుమార్

**కొడంగల్ రూరల్:** వేసవి పఠన శిబిరాలతో విద్యార్థులకు మేలు కలుగుతుందని హెచ్ఎం క్రాంతికుమార్ పేర్కొన్నారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి పఠన శిబిరంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమ్మర్ క్యాంప్ నేపథ్యంలో విద్యార్థులకు 20అంశాలపై ప్రతీరోజు ఒక్కో అంశంపై గంట సమయాన్ని కేటాయిస్తూ తర్ఫీదునిస్తున్నారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశంలో వేసవి పఠన శిబిరం నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. కరాటే, బాక్సింగ్, డ్యాన్స్, పాటల పోటీలు, కథలను చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, గణితం, మిమిక్రీ, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, పెయింటింగ్, ఏకపాత్రాభినయం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

సీఐ వెంకట్



మాట్లాడుతున్న సీఐ వెంకట్

**మోమిన్‌పేట:** రోడ్డు పక్కన వ్యాపారస్తులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించుకోవాలని సీఐ వెంకట్ పేర్కొన్నారు. బుధవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పరిధిలోని ఫంక్షన్ హాల్స్, రోడ్డుపక్కన నిర్వహిస్తున్న వ్యాపార కేంద్రాల యజమానులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను బిగించుకోవాలన్నారు. దీంతో దొంగతనాలు, అల్లర్లు, సంఘ విద్రోహక చర్యలు జరిగినప్పుడు నేరస్థులను సులభంగా గుర్తించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరవింద్, వ్యాపార కేంద్రాల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

### అల్లిపూర్, అల్లాపూర్‌లో రెవెన్యూ సదస్సులు



అల్లిపూర్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

**ధారూరు:** మండలంలోని అల్లిపూర్, అల్లాపూర్ గ్రామాల్లో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సులను ధారూరు, కోట్‌పల్లి తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సదస్సులో మొత్తం 24 మంది రైతులు వారి సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. గురువారం నర్సాపూర్, గడ్డమీది గంగారం గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

### భారత ఆర్మీ దాడులపై సంబరాలు



విజయోత్సవ సంబురాలను నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

**కుల్కచర్ల:** పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత ఆర్మీ దాడి చేసి విజయవంతంగా ఉగ్రవాదులను హతం చేయడాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, కుల్కచర్ల బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ..ప్రశాంతమైన జీవనాన్ని అతాళకుతలం చేస్తూ, అమాయక ప్రజలను చంపుతున్న ఉగ్రవాదులపై భారత ఆర్మీ దాడి చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గాదె మైపాల్, హన్మంతు, శ్రీశైలం, రఘు, మహేష్, అశోక్, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో దుక్కులతో భూసారం పెంపు

**సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప**



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప

**మొయినాబాద్‌రూరల్:** వేసవిలో దుక్కులతో భూసారం పెరుగుతుందనిరాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.జీ.మహదేవప్ప, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహదేవప్ప, శాస్త్రవేత్త డాక్టర్ రమేశ్, జిల్లా వ్యవసాయ అధికారి పాల్గొని వారు మాట్లాడుతూ.. వేసవి దుక్కులతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుందని, లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుందన్నారు. వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, పోగు, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంట దిగుబడి పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా పంట మార్పిడి చేయడంతో లాభాలు పొందవచ్చని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బీ.జే.సురేష్ మాట్లాడుతూ.. బయో ఫర్టిలైజర్స్ వాడకం, వాటి వినియోగాలపై అవగాహన కల్పించారు. రైతులు మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వాటికి సంబంధించిన రసీదులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సునీల్‌కుమార్, యాదగిరి, రైతులు నీలకంఠం, అంజయ్యగౌడ్, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉండాలి

- భోజు మహరాజ్
- భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగం పూజలో భోజు మహరాజ్, గిరిజనులు

**బొంరాస్‌పేట:** గిరిజనులు వ్యసనాలకు దూరంగా ఉండి, దైవభక్తి పెంచుకోవాలని భోజు మహరాజ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మూడుమామిళ్లతండా పంచాయతీ పరిధిలోని దీప్లానాయక్‌తండాలో మారెమ్మ సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా చండీయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంత్రోచ్ఛరణలతో సాగిన ఈ యాగంలో 32జతల గిరిజన దంపతులు పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాగంలో పాల్గొన అనంతరం భోజు మహరాజ్ మాట్లాడుతూ గిరిజనులు దైవ చింతన కలిగి ఉండాలన్నారు. మద్యం, మాంసం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే శ్రేయస్కరమన్నారు. ఆదివాసీల పూజలు చాలా నిబద్ధతతో అనాదిగా సాగుతున్నాయని పేర్కొన్నారు. వాటిని తూచా తప్పకుండా పాటించి భవిష్యత్ తరాలకు అందించాలన్నారు.

**నేడు విగ్రహాల ప్రతిష్ఠ**

మూడో రోజు గురువారం నూతనంగా నిర్మించిన ఆలయంలో మారెమ్మ, సేవాలాల్ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అనంతరం అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పూజారి రేవల్లి వెంకటేశ్వర శర్మా, నిర్వాహకులు చందర్‌నాయక్, జయరాం, గోపాల్, మాజీ సర్పంచు బద్యానాయక్, సక్రియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదెకరాల్లోపు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు



తాండూరు రూరల్: వీర్‌శెట్టిపల్లిలో సర్వే చేస్తున్న ఎంఈఓ వెంకటయ్య



దోమ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాసాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామా

**తాండూరు రూరల్:** ఐదెకరాల్లోపు భూమి ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లకు అర్హులని మండల వెరిఫికేషన్ ఆఫీసర్ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లి, కోటబాసుపల్లి, కోత్లాపూర్, మిట్టబాసుపల్లి పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాండూరు మండలంలో 722 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యిందని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఐదు ఎకరాలోపు, కారు, లారీ, గతంలో మంజూరై అసంపూర్తిగా కట్టిన ఇళ్లకు మంజూరు చేయడం కుదరదని తేల్చిచెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కట్టుకుంటేనే బిల్లు వస్తోందని పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో వెరిఫికేషన్ పూర్తి అవుతుందన్నారు.

**పేదలకే ఇందిరమ్మ ఇళ్లు**

**దోమ:** నిరుపేద కుటుంబాలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఎంపీడీఓ గ్యామా తెలిపారు. బుధవారం దోమ మండల పరిధిలోని బుద్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాసాలను సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా గ్రామంలో పేదకుటుంబాలను గుర్తించి వారి నివాసాలను పరిశీలించారు. ప్రతీ గ్రామంలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపడుతున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసిన బాధితుల నివాసాలను గుర్తిస్తున్నారు. వారు అర్హులుగా తెలితేనే ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, ఇంచార్జి ఎంపీఓ రాజేశ్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రావణ్



**బొంరాస్‌పేట:** మండల కేంద్రానికి చెందిన శ్రావణ్ బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా బుధవారం ఎన్నికయ్యారు. గతంలో బీఆర్ఎస్‌లో వైస్ఎంపీపీగా ఉన్న ఆయన ఇటీవల బీజేపీలో చేరి చురుకైన పాత్ర నిర్వహిస్తుండడంతో తనను గుర్తించి మండల అధ్యక్ష పదవి అప్పగించారు.

### 9న దేవాలయ భూముల వేలం

**షాద్‌నగర్‌రూరల్:** మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న రంగనాయకస్వామి దేవాలయానికి చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శివకుమార్ తెలిపారు. దేవాలయ వ్యవసాయ భూములను 2025–26, 2026–27 సంవత్సరాలకుగాను కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 10గంటలకు దేవాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి గలవారు రూ.5వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

# కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



ధారూరు: నాగారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున కాంగ్రెస్ నాయకులు

**కుల్కచర్ల:** రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే మద్దతు ధర లభిస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ కోరారు. బుధవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందన్నారు. రైతులు చిన్న, చిన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, సీసీ వెంకటయ్య, నాయకులు చంద్రభూపాల్ రావు, బాలకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ధారూరులో..**

ధారూరు: మోమిన్‌కలాన్, నాగారం, గురుదోట్ల, నాగసమందర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై సత్యనారాయణరెడ్డి, ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,320, సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు చైర్మన్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వరిధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తుందని, కొనుగోలు కేంద్రాలో విక్రయించి లాభపడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ కె నర్సింహులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఈఓ సంజూరాథోడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు అల్లాపూర్ మాజీ సర్పంచు రాజీనామా

**మండల అధ్యక్షుడికి అందజేత**



జెన్నె నాగప్పకు రాజీనామా పత్రం అందజేస్తున్న యాదయ్యగౌడ్

**తాండూరు రూరల్:** తాండూరు మండల కాంగ్రెస్‌లో ముసలం ఏర్పడింది. పార్టీలో గ్రూప్ రాజకీయాలు తారస్థాయికి చేరాయి. తాజాగా మండల పరిధిలోని అల్లాపూర్ మాజీ సర్పంచు నందిని యాదయ్యగౌడ్, ఉప సర్పంచు యాదయ్య గౌడ్‌లు బుధవారం కాంగ్రెస్‌కి రాజీనామా చేశారు. దీనికి సంబంధించిన రాజీనామా పత్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్పకు అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్యగౌడ్ మాట్లాడుతూ అల్లాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గెలుపునకు నిరతరం కృషి చేశామని గుర్తు చేశారు. కానీ ఎమ్మెల్యే తన సమీప బంధువు గోపాల్‌రెడ్డికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాడని వాపోయారు. ఇందిరమ్మ కమిటీ ఎంపికలతో పాటు లబ్దిదారుల ఎంపికలో కూడా తనను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటున్నారని ఆరోపించారు. తమ రాజకీయ జీవితాన్ని ఎమ్మెల్యే శూన్యం చేశాడని యాదప్ప వాపోయాడు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బంధువులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాడని రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. అంతేకాకుండా యాదప్పగౌడ్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి వర్గం కావడంతో ఎమ్మెల్సీ వర్గంపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నాడని ఆ వర్గం నాయకులు ఆరోపించారు.

### ఆర్థిక సహాయం అందజేత

**మర్పల్లి:** మండల పరిధిలోని జంషాద్‌పూర్ గ్రామానికి చెందిన బోయిని లింగమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు పంపించారు. మాజీ గ్రామ సర్పంచ్ నూరోద్దీన్ రూ.5 వేలు, గొల్ల దత్తు రూ.2వేలు, గొల్ల చంద్రయ్య రూ.2వేలు అందజేశారు. ఉప సర్పంచ్ ప్రభుయాదవ్ సోషల్ మీడియా గ్రామ కమిటీ కన్వీనర్ నరేశ్, బీసీ సెల్ అధ్యక్షుడు దత్తుతో పాటు పలువురు నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### 11 నుంచి లక్ష్మీనరసింహా స్వామి జాతర

**పూడూరు:** ఈ నెల 11నుంచి రాకంచర్ల లక్ష్మీనరసింహా స్వామి జాతర ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అఖండ దీపారాధన, ధ్వజారోహణము, సోమవారం సాయంత్రం శ్రీ యోగానంద లక్ష్మీనరసింహా స్వామి కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం, మంగళవారం రాత్రి 10 గంటలకు దీపోత్సవం, 14న సహస్ర పుష్పార్చన, 15న చక్రతీర్థం నిర్వహిస్తారని తెలిపారు. కల్యాణం చేయదలచిన భక్తులు ఆలయ పూజారులు నర్సింహాచారి, భీమాచార్యులను సంప్రదించాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర జయప్రదం చేయాలని కోరారు.



# ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్:** ఉగ్రవాదాన్ని కూకలివేళ్లతో పెకిలించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాక్ ఉగ్రవాద స్థలాలపై ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులైన పర్యాటకులపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇందుకు భారత ఆర్మీ ప్రతీకారం తీర్చుకుందన్నారు. పాక్ ఉగ్రవాద స్థలాలను టార్గెట్ చేసి మెరుపుదాడులు చేసిన తీరు హర్షణీయమన్నారు. ఇందుకు దేశం అంతా గర్విస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను అందరూ సమర్థిస్తున్నారని, ఉగ్రవాదాన్ని అంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందులో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

### రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు

**ధారూరు:** మండలంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులకు స్పందన కరువైందని కొందరు అధికారులు పేర్కొన్నారు. చాటింపు వేయిస్తే నామ మాత్రంగా వచ్చి సమావేశంలో పాల్గొంటున్నారని వివరిస్తున్నారు. రెవెన్యూ సదస్సులను ప్రతీ రైతు సద్వినియోగించుకోవాలని వారు కోరారు.

### రూ.వెయ్యి అపరాధ రుసుంతో నేటి వరకు అవకాశం

**అనంతగిరి:** ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల ఫీజును రూ. వెయ్యి అపరాధ రుసుముతో గురువారం వరకు సంబంధిత కళాశాలలో చెల్లించొచ్చని ఇంటర్ జిల్లా అధికారి శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గ్రహించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

### నేడు రొంపల్లిలో దేవతల విగ్రహ ప్రతిష్ఠ

**బంట్వారం:** రొంపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాతలు కోట నాగమణి హరిహర, కోట సంగమేశ్వర్ సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 నుంచి పోచమ్మ తల్లి ఆలయంలో శుప్రబాత సేవ, గోపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహన, గణపతి పూజ, ముఖ్య దేవతా స్థాపన, ధాన్య దివాసము జల దివాసము, మహస్న వనము శయ్యది వాసము, విగ్రహ ప్రతిష్ఠ హోమాలు నిర్వహిస్తారని తెలిపారు.

# వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి



మంగళహారతులు ఇస్తున్న ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు

**కొడంగల్ రూరల్:** పట్టణంలోని శ్రీనగరేశ్వరాలయంలో బుధవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్యుల కులదైవం కన్యకాపరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి, దూప, దీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కటుకం శివకుమార్‌గుప్తా, కొడంగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందారం ప్రశాంతుకుమార్ గుప్తా, కొత్త ఎల్లయ్య గుప్తా, ఈశ్వరయ్యగుప్తా, మైలారం నారాయణ, అన్నారం రామానంద్, ఆకుల ప్రవీణ్, అన్నారం మురళి, కొక్కళ్ల చందు, చిదిరి వినోద్‌కుమార్, చిదిరి వీరు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మమత, అనిత, హైమావతి, శ్రీదేవి, గాయత్రి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిది

**మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

**షాద్‌నగర్:** దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాక్ భూభాగంపై మన బలగాలు విజయవంతంగా దాడులు నిర్వహించిన నేపథ్యంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార దాడులు చేయడం సరైన చర్య అన్నారు. భద్రతా బలగాలు ఖచ్చితమైన దాడి చేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా భారత సాయుధ దళాలు జరిపిన దాడులు చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ఎంతో మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోడంతో దేశం మొత్తం కన్నీరు పెట్టిందన్నారు. ఉగ్రస్థావరాల నిర్మూలనకు తమదైన శైలిలో సైనికులు దాడులకు పాల్పడటాన్ని చూసి దేశ ప్రజలు సంతోషిస్తున్నారన్నారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఇక నుంచి ఉగ్రవాదం పూర్తిగా కనుమరుగు కావాలని ఆకాంక్షించారు.

# సెమినార్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

**చేవెళ్ల:** సీపీఐ పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10న చేవెళ్లలో మతసామరస్యం పౌరుల బాధ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు సీపీఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి తెలిపారు. మున్సిపాలిటీలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ ఆధ్వర్యంలో సెమినార్‌కు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో రోజురోజుకు అసమానతలు పెరిగిపోయి కులపరమైన విభజనతో పాటు మతపరమైన విభజనలు తీసుకొచ్చి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి ప్రభుత్వాలే కారణమని మండిపడ్డారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సామాజిక ఉద్యమ నాయకుడు ఎస్ఎం ఖలీల్ ముఖ్య అతిథిగా వస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు సీపీఐ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, సుధాకర్‌గౌడ్, కృష్ణ, సుభాన్‌రెడ్డి, శ్రీను తదితరులు ఉన్నారు.

# ఆర్మీ మెరుపుదాడులు తలెత్తుకునేలా చేశాయి

**బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్**

**షాద్‌నగర్‌రూరల్:** పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత ఆర్మీ మెరుపుదాడులు అందరినీ తలెత్తుకునేలా చేశాయని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ అన్నారు. ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం దాడులు చేసిన సందర్భంగా బుధవారం వెంకటేశ్ ప్రకటన విడుదల చేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా దాడులు చేయడం బాధాకరమన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా సైనికులు జరిపిన దాడులు చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ సహకరిస్తుంటే భారత్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.